ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 02-05-2025 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. కుల గణన ఆధారంగా వెనుకబడిన వర్గాలకు రాజకీయ విద్యా ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం చేసిన చట్టం అమలుకు తమ ప్రభుత్వానికి అనుమతి ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

2. హైదరాబాద్ జిల్లాలో ముద్ర రుణాల మంజూరు ప్రక్రియపై పూర్తి నివేదికను తయారు చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అధికారులకు, బ్యాంకర్లను ఆదేశించారు.

3. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణను పూర్తిగా విస్మరించిందని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు.

4. రాష్ట్రంలో రానున్న నాలుగు రోజుల పాటు పలు ప్రాంతాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పలు జిల్లాలకు వాతావరణ కేంద్రం పసుపు రంగు హెచ్చరిక జారీ చేసింది.

**కులగణన-పొన్నం ప్రభాకర్**

రాష్ట్ర ప్రభుత్వం కుల గణన ఆధారంగా వెనుకబడిన వర్గాలకు రాజకీయ విద్యా ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు చట్టం అమలుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని మంత్రి , ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సీనియర్ నాయకుడు పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. వెనుకబడిన వర్గాల సంక్షేమం పట్ల కేంద్ర ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. కుల గణన ఆధారంగా శాసనసభలో ఆమోదించినా బిల్లుకు ఆమోదముద్రవేసి అమలు కోసం కేంద్ర

ప్రభుత్వానికి పంపినందుకు ప్రదేశ్ కాంగ్రెసు BC నాయకుల ప్రతినిధి బృందం ఈ రోజు హైదరాబాద్ లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పొన్నం ప్రభాకర్ విలేకరులతో మాట్లాడుతూ , దేశ వ్యాప్తంగా కుల గణన చేస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం చేసిన కుల గణన ఆధారంగా బీసీ BC రిజర్వేషన్లు పెంచేందుకు చేసిన చట్టాన్ని అమలు చేయాలని కోరారు.

SOUND BITE … PONNAM

(MSL)

**కిషన్ రెడ్డి-దిశ రివ్యూ**

హైదరాబాద్ జిల్లాలో ముద్ర రుణాల మంజూరు ప్రక్రియపై పూర్తి నివేదికను తయారు చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అధికారులు , బ్యాంకర్లను ఆదేశించారు. హైదరాబాద్‌లోని ఎంసీ హెచ్ ఆర్డీ భవనంలో ఈ రోజు జిల్లా అభివృద్ధి సమన్వయ , పర్యవేక్షణ కమిటీ దిశ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన 17 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొదటిసారి ముద్ర రుణాలకు దరఖాస్తు చేసిన వారిలో ఎంతమందికి రుణాలు మంజూరయ్యాయనే అంశంపై ఆయన అధికారులు , బ్యాంకులను ప్రశ్నించారు. మంజూరైనవి , తిరస్కరించిన వాటితో పాటు పరిశీలనలో ఉన్న దరఖాస్తుల వివరాలతో కూడిన పూర్తి నివేదికను తక్షణమే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న అభివ్రుద్ధి కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందాలని కిషన్ రెడ్డి ఆదేశించారు. మరోవైపు ఫిల్ నగర్ లో భూ ఆక్రమణలు తొలగించే విషయంపై , హౌజింగ్ సదుపాయాల కల్పన అంశంపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

MSL/MSM

**హరీశ్ రావు**

NDA నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణను పూర్తిగా విస్మరించిందని మాజీ మంత్రి , బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సంగారెడ్డి జిల్లా అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు గతంలో బీఆర్ఎష్ ప్రారంభించిన బసవేశ్వర , సంగమేశ్వర ప్రాజెక్టుల నిర్మాణాలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కనపెట్టి సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ నియోజకవర్గానికి అన్యాయం చేసిందన్నారు. తాగు, సాగునీరు కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే జిల్లా మొత్తం సాగునీటితో సస్యశ్యామలం అవుతుందన్నారు. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తి చేయడానికి బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని తెలిపారు

(డెస్క్)

**కిషన్ రెడ్డి-నితీన్ గడ్కరి పర్యటన**

హైదరాబాద్ నగరం, చుట్టుపక్క ప్రాంతాల్లో రహదారి మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే ప్రక్రియలో కీలక ముందడుగు పడనుందని కేంద్ర బొగ్గు ,గనుల శాఖ మంత్రి , బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి తెలిపారు. ఈ నెల 5వ తేదీన కేంద్ర రవాణా , రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ 15 వందల 52.91 కోట్ల రూపాయల విలువైన రహదారి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు. 22.57 కిలోమీటర్ల పొడవైన రహదారి అభివృద్ధి పనులు ప్రారంభించిస్తారని పేర్కొన్నారు. వీటి మొత్తం వ్యయం 895.64 కోట్ల రూపాయలని సామాజిక మాధ్యమ పోస్టులో వెల్లడించారు. మరో 657.27 కోట్ల రూపాయాల వ్యయంతో కొత్తగా 20.87 కిలో మీటర్ల రహదారి నిర్మాణ పనులకు కూడా నితిన్ గడ్కరీ శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

(డెస్క్)

**ఆసిఫాబాద్ ఎంపీ –నితిన్ గడ్కరి సభ ఏర్పాట్లు**

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ  ఆసిఫాబాద్ జిల్లాలోని రెబ్బెన మండలం కాగజ్ నగర్ క్రాస్ రోడ్ వద్ద ఈ నెల   5వ తేదీన  363వ నంబర్ జాతీయ రహదారి ప్రారంభిస్తారు. అనంతరం జరిగే బహిరంగ సభాలో పాల్గొంటారు. ఈ కార్యక్రమాల ఏర్పాట్లను ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గొడం నగేష్, సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్ బాబుతో కలిసి ఈ రోజు  పరిశీలించారు.

(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)

**మిస్ వరల్డ్ సన్నాహకాలు**

హైదరాబాద్ వేదికగా ఈనెల   10 నుంచి నుంచి   31 వరకు  72వ ప్రపంచ అందాల పోటీలు జరగనున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా  140 దేశాల నుంచి యువతులు పోటీల్లో పాల్గొంటారని మిస్ వరల్డ్ సంస్థ తెలిపింది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఆరంభ వేడుకలు  , హైటెక్స్ లో ఫైనల్స్ పోటీలు నిర్వహించాలని ప్రణాళిక రూపొంచగా.. మిస్ వరల్డ్ సంస్థ   , రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ప్రపంచ అందాల పోటీల ఏర్పాట్లపై సమీక్షించేందుకు మిస్ వరల్డ్ లిమిటెడ్ ఛైర్‌పర్సన్  ,  సీఈవో జూలియా ఈవేలిన్ మోర్లీ ఈ ఉదయం నగరానికి చేరుకున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఆమెకు సాంప్రదాయ పద్ధతిలో అధికారులు స్వాగతం పలికారు.

(డెస్క్)

**నిర్మల్-ధాన్యం కొనుగోళ్లు (బైట్)**

నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్టు జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ తెలిపారు.  1.64లక్షల మెట్రిక్ టన్నుల దాన్యం వచ్చే అవకాశం ఉందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేసినట్టు ఆకాశవాణితో తెలిపారు.

(బైట్ అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్)

(పిటిసి నిర్మల్ జిల్లా)

**వరంగల్ -భద్రకాళి బ్రహ్మోత్సవాలు**

వరంగల్ లోని భద్రకాళి అమ్మవారి కళ్యాణ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈరోజు జరిగే శంకర జయంతి సందర్భంగా శంకర భగవత్పాద సమారాధన అనంతరం చతుస్థానార్చన నిర్వహించారు .

(వరంగల్ జిల్లా పి టి సి)

**వాతావరణం**

రాష్ట్రంలో రానున్న నాలుగు రోజుల పాటు పలు ప్రాంతాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు , మెరుపులు, ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈరోజు , రేపు కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి , రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి , వికారాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలకు పసుపు రంగు హెచ్చరిక జారీ చేసింది.

(డెస్క్)

**క్రికెట్ - ఐపీఎల్**

ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ లో భాగంగా ఈ రోజు రాత్రి అహ్మదాబాద్ లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగే మ్యాచ్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు గుజరాత్ టైటాన్స్ జట్టుతో

తలపడుతుంది. ఇప్పటిదాకా ఆడిన తొమ్మిది మ్యాచ్ ల్లో సన్ రైజర్స్ మూడింటిలో గెలిచి ఆరు మ్యాచ్ ల్లో ఓడిపోయింది. 6 పాయింట్లతో పట్టికలో తొమ్మిదో స్థానంలో నిలిచింది. మరోవైపు గుజరాత్ టైటాన్స్ తొమ్మిది మ్యాచుల్లో ఆరింటిలో గెలిచి 12 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది.

(డెస్క్)

**నిర్మల-కలెక్టర్**

నిర్మల్ జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ -సిఎంఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. నిన్న సాయంత్రం సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించి సిఎంఆర్ సరఫరాలో ప్రతీ మిల్లరూ గడువులోపు లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత మిల్లర్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

(పీటీసీ, నిర్మల్)

**పదో తరగతి-సప్లిమెంటరీ పరీక్షలు**

రాష్ట్రంలో పదో తరగతి అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం షెడ్యూల్ విడుదల చేసింది. వార్షిక పరీక్షలో ఉత్తీర్ణత సాధించలేకపోయిన విద్యార్థులు రీ కౌంటింగ్ లేదా రీ వెరిఫికేషన్ ఫలితాల కోసం ఎదురుచూడకుండా తగిన సమయంలో ఫీజు చెల్లించి , సప్లిమెంటరీ పరీక్షల కోసం నమోదు చేసుకోవచ్చని పరీక్షల విభాగం సూచించింది. విద్యార్థులు ఫీజును తమ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడికి ఈనెల 16వ తేదీలోపు చెల్లించాలని తెలిపింది.

(డెస్క్)

**సిరిసిల్ల-రైతుల ధర్నా**

వరి ధాన్యం కొనుగోలు లో జాప్యాన్ని నిరసిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలో రైతులు ధర్నా చేపట్టారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. రైతులు రోడ్డుపై బైఠాయించడంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. రైతుల ధర్నాకు బిఆర్ఎస్ మద్దతు ప్రకటించింది.

(పిటిసి,రాజన్న సిరిసిల్ల జిల్లా )

**నల్లగొండ-ఉపాధి హామీ**

నల్లగొండ జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద పెంచుతున్న నర్సరీల ద్వారా రైతులకు , ఇంటి యజమానులకు ఇచ్చే మొక్కలు వారికి ఉపయోగపడే విధంగా ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ సృజన అన్నారు. నల్గొండ జిల్లాలోని చిట్యాల,నార్కెట్ పల్లి మండలాలలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులతో పాటు , పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా చేపట్టిన పనులను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి కూలీలతో మాట్లాడి పని విధానంతో పాటు వేతనం కు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు.

(పిటిసి నల్లగొండ జిల్లా)

**కరీంనగర్ -పన్ను వసూళ్ల లో జమ్మికుంట పురపాలక**

2024-25 సంవత్సరానికి ఆస్తి పన్ను వసూళ్లలో కరీంనగర్ జిల్లా జమ్మికుంట పురపాలక సంఘం రాయితీతో ఆస్తి పన్ను వసూలులో ప్రథమ స్థానంలో నిలిచిందని జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ తెలిపారు. 5 శాతం రాయితీతో ఆస్తి పన్ను వసూళ్లలో జమ్మికుంట 55.04 శాతం సాధించిందని వెల్లడించారు. దాంతో జమ్మికుంట మున్సిపాలిటీకి 3

కోట్ల రూపాయల ప్రోత్సాహక నిధులకు సంబంధించి పురపాలక శాఖ రాష్ట్ర డైరెక్టర్ ప్రొసీడింగ్స్ అందజేయనున్నట్లు చెప్పారు.

(పిటిసి, కరీంనగర్)

జోగులాంబ –ఇంటర్ ప్రవేశాలు

జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండల కేంద్రంలోని కేజీబీవీ జూనియర్ కళాశాలలో ఎంపీసీ , బైపిసి గ్రూపులలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ గుంటి గోపిలత తెలియజేశారు. పదో తరగతి పాసైన విద్యార్థులు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 80085 30209 నంబర్ ను సంప్రదించాలన్నారు.
(పీటీసీ, జోగులాంబ)